క్లుప్తంగా

సేవలతోనే గుర్తింపు



డిప్యూటీ తహసీల్దార్ లావణ్యను సత్కరిస్తున్న తహసీల్దార్ గోవింద, తదితరులు

పూసపాటిరేగ: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని తహసీల్దార్ తాడ్డి గోవింద అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, సర్వే డీటీ హేమంత్, సీనియర్ అసిస్టెంట్ వేణు, జూనియర్ అసిస్టెంట్ ఇందులకు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగికి బదిలీ సర్వసాధారణం అయినప్పటికీ, పనిచేసే చోట అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్ గణపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పీవీ మాధురి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వాల్మీకి రామాయణంలో లౌకిక అంశాలు..



వాల్మీకి రామాయణంపై మాట్లాడుతున్న పండితులు

విజయనగరం రూరల్: వాల్మీకి రామాయణంలో నేటి సమాజానికి అవసరమైన లౌకిక, ఆధ్యాత్మికపరమైన అంశాలు ఎన్నో మిళితమై ఉన్నాయని తిరుపతికి చెందిన జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉప కులపతి జీఎస్సార్ కృష్ణమూర్తి అన్నారు. రామనారాయణం వాల్మీకి రామాయణం రీసెర్చ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఆయల సోమయాజులు, గోపాలరావు, భక్తులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి వీడ్కోలు



బదిలో అధికారి శ్రీనివాసరావుతో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు

విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్రంలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో పర్సనల్ ఆఫీసర్‌గా (పీఓ) పనిచేసి బదిలీపై వెళ్తున్న శ్రీనివాసరావుకు వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు శుక్రవారం వీడ్కోలు పలికారు. ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో పీఓను కలిసి పార్వతీపురం మన్యం జిల్లాకు పీఓగా వెళ్లడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బీకేవీ ప్రసాదరావు, నాయకులు శ్రీనివాసరావు, లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ



ఈవీఎం బాక్సులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

నెల్లిమర్ల : నగరం పంచాయతీ పరిధిలో ఉన్న ఈవీఎం గోదాములను కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. గదులకు వేసిన సీళ్లను తెరిపించి పరిశీలించి, అనంతరం సీళ్లు వేయించారు. ఎన్నికల్లో వినియోగించనవి, రిజర్వులో ఉంచిన ఈవీఎంలను తరలించేందుకు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని ఆర్డీఓను ఆదేశించారు. గోదాముల పక్కన వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఆ ప్రాంతాన్ని ఎత్తు చేయాలని మున్సిపల్, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తనిఖీల్లో డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆర్డీఓ ఎంవీ సూర్యకళ, ఈవీఎంల ఇన్‌చార్జి బి.ఉమాశంకర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, నెల్లిమర్ల తహసీల్దార్ సుదర్శనరావు, మున్సిపల్ కమిషనర్ అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు నర్సింహమూర్తి, సముద్రపు రామారావు, శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సామూహిక సీమంతంలో పాల్గొన్న పీడీ శాంతకుమారి, తదితరులు

పూసపాటిరేగ: ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎం. శాంతకుమారి అన్నారు. మండలంలోని గుంపాం గ్రామంలో గోవిందపురం సెక్టార్ పరిధిలో పలువురు గర్భిణులకు శుక్రవారం సామూహిక సీమంతం చేశారు. కార్యక్రమంలో భోగాపురం ఐసీడీఎస్ పీఓ ఎస్తేరురాణి, సూపర్‌వైజర్ సత్యవతి, కార్యకర్త సుజాత తదితరులు పాల్గొన్నారు.

అధికారులు రాజకీయం చేయొద్దు..

● ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ప్రభుత్వం మారిన తర్వాత కొంతమంది అధికారులు అధికారపార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారని, ఇది సరికాదని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. అధికారులు రాజకీయం చేయొద్దని హితవు పలికారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సారిక పంచాయతీలో భూముల రీసర్వే సక్రమంగా జరగకపోవడంతో అవినీతి చోటు చేసుకుందన్నారు. దీంతో రెవెన్యూ సిబ్బందిపై మండిపడ్డారు. అలాగే వెలుగు శాఖకు సంబంధించి కొంతమంది అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించి గ్రామస్థాయిలో ఉన్న ఉద్యోగులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా తాము ప్రజాప్రతినిధులమేనన్న విషయాన్ని ఉద్యోగులు గుర్తుంచుకోవాలని సూచించారు. మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో రావడం లేదని, గత సమావేశంలో తెలియజేసిన ఫిర్యాదులకు పరిష్కారమార్గం చూపకుండా చేతులు దులుపుకుని వస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కోరుకొండపాలెం సర్పంచ్ బోని కృష్ణ మాట్లాడుతూ.. పినవేమలి నుంచి కోరుకొండపాలెం వెళ్లే దారిలో ఉండే బందకు గండి పడడంతో సుమారు 500 ఎకరాలు ముంపునకు గురయ్యాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని నీటిపారుదల శాఖాధికారులకు తెలియజేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఎంపీడీఓ చంద్రకళ మాట్లాడుతూ.. మండలానికి 25 మినీ గోకులాలు మంజూరయ్యాయన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఉపాధి ఏపీఓ రవిబాబు మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 889 పనులకు సంబంధించి 7,725 కుటుంబాలకు 5,43,000 పనిదినాలు కల్పించడం జరిగిందన్నారు. అనంతరం పలువురు సభ్యులు గ్రామ సమస్యలపై ఎంపీపీ దృష్టికి తీసుకురాగా.. అధికారులు పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో సమావేశం ముగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కొసర నిర్మల, కర్రోతు నారాయణ, తహసీల్దార్ కూర్మనాథ్, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

తీరప్రాంతంలో జెట్టీ నిర్మించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శాంతకుమారి, తదితరులు

పూసపాటిరేగ : తీరప్రాంతంలో జెట్టీ నిర్మించాలని పలువురు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి బి. శాంతకుమారి అధ్యక్షతన వికసిత్ భారత్ – 2047 ప్లాన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అభిప్రాయాలు తెలిపారు. తీరప్రాంతంలో కొబ్బరి ఉత్పత్తులు ఉండడంతో అనుబంధ పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. పూసపాటిరేగలో కార్మికులకు ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని తెలిపారు. అలాగే పూసపాటిరేగకు మోడల్ స్కూల్, పాలిటెక్నికల్ కళాశాల, ఐటీఐ మంజూరు చేయాలని అభిప్రాయపడ్డారు. ఎక్కువగా పరిశ్రమలు ఉన్నందున అగ్నిమాపక స్టేషన్ మంజూరు చేయాలని కోరారు. తీరప్రాంతంలో అవసరమైన చోట తుఫాన్ షెల్టర్లు నిర్మించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఎంపీడీఓ ఎం. రాధిక, తహసీల్దార్ తాడ్డి గోవింద, మండల వ్యవసాయాధికారి కె.నీలిమ, ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న, ప్రజాప్రతినిధులు మహంతి చిన్నంనాయుడు , ఎంపీజీ శంకరరావు, పతివాడ అప్పలనాయుడు, మహంతి శ్రీనివాసరావు, పిన్నింటి సన్యాసినాయుడు, జమరాజు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం..



రక్తదానం చేస్తున్న లీలాప్రసాద్

నెల్లిమర్ల: అత్యవసర పరిస్థితుల్లో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అప్పలరమణ అనే పేషెంట్‌కి సాధన యువజన సంఘ సభ్యుడు శుక్రవారం రక్తదానం చేశారు. రోగికి బాంబే బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో బంధువులు జరజాపుపేట గ్రామానికి చెందిన సాధన యువజన సంఘాన్ని సంప్రదించారు. దీంతో సంఘ సభ్యుడు హరి లీలాప్రసాద్ వెంటనే విశాఖ వెళ్లి రక్తదానం చేశారు. దీంతో హరి లీలాప్రసాద్‌ను సంఘ అధ్యక్షుడు పి. దుర్గాప్రసాద్, కార్యదర్శి వెంకటరమణ, తదితరులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



కమిషనర్ అప్పలరాజును అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది

నెల్లిమర్ల: నగర పంచాయతీ కమిషనర్‌గా కె. అప్పలరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న అప్పలరాజు కమిషనర్‌గా బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన బాలాజీప్రసాద్ శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసకు బదిలీపై వెళ్లారు. నూతన కమిషనర్‌కు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది విశ్వేశ్వరరావు, పాపయ్యరాజు, ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

మేనేజర్ విశ్వేశ్వరరావుకు బదిలీ..

నగర పంచాయతీ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న టీవీఎస్ విశ్వేశ్వరరావుకు అనకాపల్లి జిల్లా యలమంచిలి మున్సిపల్ కార్యాలయానికి మేనేజర్‌గా బదిలీపై వెళ్లనున్నారు. అలాగే నగర పంచాయతీలో ఆర్ఐగా పనిచేస్తున్న పాపయ్యరాజు బదిలీపై పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మున్సిపాలిటీకి వెళ్లనున్నారు.

వరద బాధితులకు విరాళం..



కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు చెక్కు అందజేస్తున్న చీపురుపల్లి లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విద్యార్థులు



వరద బాధితులకు విరాళం అందిస్తున్న కంటకాపల్లి జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు

విజయనగరం అర్బన్: భారీ వర్షాలకు అతలాకుతలమైన విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఎంతోమంది ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు సైతం తాము దాచుకున్న సొమ్మును బాధితులకు అందజేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. చీపురుపల్లికి చెందిన లిటిల్ ఏంజిల్ ప్రైమరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు తాము సేకరించిన రూ.60,000 మొత్తాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ మేరకు విద్యార్థులను కలెక్టర్ అభినందించారు.

కంటకాపల్లి విద్యార్థుల వితరణ

కొత్తవలస మండలం కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.16,365 విలువైన చెక్కును కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎ.ప్రేమ్‌కుమార్, పాఠశాల హెడ్‌మాస్టర్ వి.అరుణకుమార్, సిబ్బంది బి.నరసింహనాయుడు, సీహెచ్ అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల భిక్షాటన



నగరంలో భిక్షాటన చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

విజయనగరం పూల్‌బాగ్: క్లాప్ వెహికల్ డ్రైవర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ స్వచ్ఛాంధ్ర క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) శుక్రవారం నగరంలో భిక్షాటన చేపట్టారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం దగ్గర మూడు రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ.. క్లాప్ డ్రైవర్లతో గొడ్డు చాకిరీ చేయించుకుంటూ, జీతాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ జీఓ ప్రకారం రూ. 18,500 జీతం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, పది వేల రూపాయలు మాత్రమే ఇవ్వడం అన్యాయమని వాపోయారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించని ఎడల ఈ నెల 30 నుంచి సమ్మె చేపట్టక తప్పదన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడుగు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బంగారు శ్రీనివాసరావు, క్లాప్ వెహికల్ డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో పాప ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వెంకన్న సన్నిధిలో..

విజయనగరం: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ పవిత్రతను కూటమి సర్కారు దెబ్బతీస్తున్న క్రమంలో అధిష్టానం పిలుపు మేరకు స్థానిక వేంకటేశ్వర సన్నిధిలో శనివారం పాపప్రక్షాళన పూజలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

స్ఫూర్తిదాయకంగా సేవా కార్యక్రమాలు

● కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు భవిష్యత్‌లో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హి సేవ సెల్ఫీ పాయింట్లను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా పలువురు అధికారులు సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు తీసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు అన్ని ప్రాంతాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరం



కళాశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తున్న రూరల్ ఎస్సై అశోక్‌కుమార్

విజయనగరం క్రైమ్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్సై వి. అశోక్‌కుమార్ అన్నారు. సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వీటీ అగ్రహారంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన గంజాయి తాగడం, వి క్రయించడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పి ంచారు. కళాశాలలో విద్యార్థుల సౌలభ్యం కోసం ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరిమాను చెట్టుకు పూజలు



సిరిమాను చెట్టుకు పూజలుచేస్తున్న భక్తులు

● శాస్త్రోక్తంగా పూజలు, అనంతరం సేకరణ, తరలింపు

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ గ్రామంలో గుర్తించిన విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను, ఇరుసుమాను చెట్లను భక్తులు శుక్రవారం పూజలు చేశారు. అమ్మవారి సిరిమానుకు ఘటాలతో చల్లదనం చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించారు. మజ్జి అప్పారావు కల్లంలోని రెండు చింతచెట్లకు శనివారం వేదపండితుల సమక్షంలో పూజలుచేసి సేకరణ కార్యక్రమం ప్రారంభిస్తారని గ్రామస్తులు తెలిపారు.

డ్రగ్స్‌తో జీవితం నాశనం

● భోగాపురం సీఐ రామకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న భోగాపురం సీఐ రామకృష్ణ



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

డెంకాడ: డ్రగ్స్ వినియోగంతో జీవితం నాశనమవుతుందని భోగాపురం సీఐ రామకృష్ణ అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధి గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతంగా చూడాలన్న ఆకాంక్షతో చదివిస్తుంటారన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడితే మీ తల్లిదండ్రులు సమాజంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటారని తెలిపారు. లక్ష్యంతో చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సై సన్యాసినాయుడు, ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి కృషి చేయండి



కార్పొరేషన్ అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ రవీంద్ర

● మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర

విజయనగరం: అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో నగర అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా చేపట్టాల్సిన ప్రాధాన్యత అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి గాను రెవెన్యూ వసూళ్లను గణనీయంగా పెంచాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తిని ఆదేశించారు. స్వచ్ఛతా హి సేవ నిర్దేశిత కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఇంజినీరింగ్, ప్రణాళిక విభాగం అధికారులతో చర్చించారు. సమావేశంలో విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం పూల్‌బాగ్: నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో తాగునీరు సరఫరా చేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు ఎ. జగన్ మోహనరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 10,11వ పీఆర్‌సీలో ఇంజినీరింగ్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా బేసిక్ వేతనం రూ.21 వేలు, టెక్నికల్ కార్మికులకు రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామానాయుడు, అరుణ్, నారాయణరావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే 'వెల్ఫేర్ డే'



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్‌డే నిర్వహిస్తున్నట్టు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి వినతులు స్వీకరించారు. సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను నోట్ చేసుకుని త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో సీతారామచంద్రస్వామి పవిత్రోత్సవాలకు శుక్రవారం రాత్రి వైభవంగా అంకురార్పణ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేద రుత్విక్కుల ఆధ్వర్యంలో స్వామి సన్నిధిలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, తదితర కార్యక్రమాలను జరిపించి అంకురార్పణ చేపట్టారు. ప్రతి ఏటా భాద్రపద బహుళ దశమి మొదలుకుని త్రయోదశి వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, వరప్రసాద్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

రామతీర్థంలో శ్రీరామ సుప్రభాతం..



శ్రీరామతీర్థం రఘుపుంగవ ఆడియోను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, సినీ సంగీత దర్శకుడు సురేష్

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఇక నుంచి శ్రీరాముడి సుప్రభాతం వినిపించనుంది. శ్రీరామతీర్థ రఘుపుంగవ సుప్రభాతం ఆడియోను స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక కల్యాణ మండపం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ ఆధ్వర్యంలో వర్ధమాన గాయకులు పవన్, నిత్య సంతోషిని గానం చేసిన సుప్రభాతం ఆడియోను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ.. సుదీర్ఘ చరిత్ర కలిగిన రామతీర్థంలో సుప్రభాతం ఆడియోను విడుదల చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇక నుంచి ప్రతి రోజూ వేకువజామున 4 గంటలకు సుప్రభాతం ఆడియోను వినిపించాలని సిబ్బందికి ఆదేశించారు. రామతీర్థం దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తామని, గిరి ప్రదక్షిణకు సంబంధించి బోడికొండ చుట్టూ ఉన్న రహదారి నిర్మాణాన్ని త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, నిర్వాహకులు రామచంద్రరావు, కాళిదాసు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని, నాయకులు చనమల్లు వెంకటరమణ, అంబళ్ల అప్పలనాయుడు, రవ్వా నాని, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.